వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 16 ఫిబ్రవరి, 2024

## వనస్థలి పురం ఏసిపిగా కాశీరెడ్డి బాధ్యతల స్వీకరణ




ఎల్ బి నగర్ (వాయిస్ టుడే)వనస్థలిపురం నూతన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ)గా పి.కాశీరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. టీఎస్ ట్రాన్స్ కో నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చి ఏసీపీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పని చేశారు. గతంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓగా విధులు నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ ఎస్.భీమ్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వెళ్లారు.

## గిరిజన ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి



వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 15 మేడిపల్లి : గురువారం రోజు బంజరాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి వేడుకలు ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని మేడిపల్లిలో సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తారా సింగ్ నాయక్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దర్గా సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు శ్రీలత బద్రు నాయక్ , అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాథోడ్ , మరియు కమిటీ సభ్యులు గూగులోత్ శ్రీనివాస్ నాయక్, నేనావత్ చందులాల్ నాయక్, హర్ల నాయక్, ఉపేందర్ నాయక్, సోమ్లా నాయక్, మరియు జాతి పెద్దలు భూక్య మణిరాం నాయక్, సురేష్ నాయక్, రామకోటి నాయక్, జుమీలాల్ నాయక్ గూగులోత్ అరుణ బాయ్, సంధ్య రాథోడ్ మరియు మహిళలు పాల్గొన్నారు.

## నూతన భాధ్యతలు స్వీకరించిన ఏసిపి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపిన సత్యం శ్రీరంగం




కూకట్పల్లి :ఫిబ్రవరి 15(వాయిస్ టుడే) కూకట్‌పల్లి అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన ఏసిపి శ్రీనివాస రావు ను గురువారం పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ పలువురు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన ఎండీ చున్నుపాష




కూకట్పల్లి : ఫిబ్రవరి 15(వాయిస్ టుడే) కూకట్పల్లి ఆసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న కే శ్రీనివాస్ రావు ను గురువారం మూసాపేట్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఎండీ చున్నుపాషా శాలువా తో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎండీ నయీమ్, ఎండీ మొహ్సిన్ ఎండీ ఇర్ఫాన్, ఎండీ కాజా షేక్ అల్లాదుదీన్, ఎండీ అమీర్, ఎండీ జకీర్ తదితరులు పాల్గొన్నారు.

## కింగ్స్ గ్రూప్ సంస్థల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్‌లోని కింగ్స్ గ్రూప్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కింగ్స్ గ్రూప్ సంస్థలపై ఫెమా చట్టం కింద నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌లోని ఏడు వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. సోదాల్లో కీలక పత్రాలతోపాటు డిజిటల్ పరికరాలు, రూ. 76.5 లక్షల నగదు, రూ. 1.5 లక్షలు విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. కింగ్స్ సంస్థలకు చెందిన మహ్మద్ షానవాజ్, మహ్మద్ జుబేరుద్దీన్‌తో పాటు మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా విదేశాలకు నిధులు మళ్లించినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతోంది.

# బిచ్కుందలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించిన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ భార్గవ సుధీర్

కామారెడ్డి బ్యూరో ఫిబ్రవరి15 వాయిస్ టుడె: ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ అర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని, ఆర్థిక వ్యవహారాలు రిజర్వ్ బ్యాంక్ గుర్తించిన ఆర్థిక సంస్థల ద్వారా చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంస్థలలో ఆర్థిక మోసాలు జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబేడ్కస్మన్ ద్వారా పరిష్కారం పొందవచ్చు అన్నారు.బ్యాంకులో అందించే సేవింగ్ పథకాలను, రుణ పథకాలను, బీమా పథకాలను, సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు ఆర్థిక అక్షరాష్ట కేంద్రాలు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు కెనరా బ్యాంకు ఇదివరకే జిల్లాలో 3 ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను స్పాన్సర్ చేసిందని ప్రస్తుతం మరో మూడు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను స్పాన్సర్ చేశామన్నారు. అలాగే ఫిబ్రవరి 13వ తేదీన సదాశివనగర్ లో, 14 వ తేదీన బాన్సువాడ లో కామారెడ్డి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ భార్గవ సుధీర్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించారు.



ప్రస్తుతం ఉన్న మూడు కేంద్రాలు 1.కామారెడ్డి,
2.మాచారెడ్డి, 3.ఎల్లారెడ్డి,

కామారెడ్డి కేంద్రా - కామారెడ్డి, రాజంపేట తాడ్వాయి మండల లోని గ్రామాల్లో, మాచారెడ్డి కేంద్రా- దోమకొండ, మాచారెడ్డి రామారెడ్డి మండలా లోని గ్రామాల్లో , ఎల్లారెడ్డ కేంద్రా - లింగంపేట్, ఎల్లారెడ్డి నాగిరెడ్డిపేట్ మండలంలోని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

కొత్తగా స్పాన్సర్ చేసిన మూడు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు - 1.సదాశివనగర్, 2.బాన్సువాడ, 3.బిచ్కుంద,

సదాశివ నగర్ కేంద్రా - గాంధారి, సదాశివనగర్, బిబిపేట్ & బిక్నూర్ మండలాల లోని గ్రామాల్లో, బాన్సువాడ కేంద్రా - నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్ & నస్రుల్లాబాద్ మండలాల లోని గ్రామాల్లో,

బిచ్కుంద కేంద్రా - జుక్కల్, పిట్లం, బిచ్కుంద , పెద్ద కొడపగల్ & మద్నూర్ మండలాల లోని గ్రామాల్లో అవగాహన కల్పించనున్నారు. రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్ మరియు కెనరా బ్యాంక్ వారి సౌజన్యంతో, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను వివిధ మండలాల్లో స్థాపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి కెనర బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ డిస్ట్రక్ కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆర్థిక అక్షరాస్య కేంద్ర ప్రారంభోత్సవానికి విచ్చేసినటువంటి అందరికీ కూడా సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి ఆంజనేయులు మరియు ప్రాజెక్ట్ మేనేజర్ వి అశోక్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.

## చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సునీతారెడ్డి!

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కాంగ్రెస్ ఫోకస్..**

**నేడు హస్తం గూటికి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ ’**

**చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా సునీతారెడ్డి!**



హైదరాబాద్/రంగారెడ్డి, ఫిబ్రవరి 15: పార్లమెంట్ ఎన్నికలకు ముందు అధికార కాంగ్రెస్ పార్టీ చేరికలను ముమ్మరం చేసింది. బీఆర్ఎసకు మంచి పట్టున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై ఫోకస్ పెట్టింది. ప్రధాన ప్రతిపక్షమైన గులాబీ పార్టీని కోలుకోలేని దెబ్బ తీసేందుకు వ్యూహరచన మొదలు పెట్టింది. ఇందులో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబానికి గాలం వేసింది. మహేందర్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఇటీవలే సీఎం రేవత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. సునీతారెడ్డికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇవ్వడంతో వారి కుటుంబం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైంది. తెలంగాణ పునర్‌నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సునీతారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, వారి కుమారుడు రినీషరెడ్డిలు తమ అనుచరులతో కలిసి కాంగ్రెసలో చేరనున్నారు. ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎసకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సునీతారెడ్డితో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మహేందర్‌రెడ్డి నివాసం నుంచి గాంధీభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే సునీతారెడ్డి వరుసగా మూడోసారి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. రెండుసార్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేయగా, ప్రస్తుతం వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఈ కారణంగానే ఆమెకు చేవెళ్ల ఎంపీ సీటు ఇచ్చేందుకు కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా వీరితోపాటు జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒకరు నేడు కాంగ్రెసలో చేరనున్నట్లు తెలుస్తోంది.

## నిజామాబాద్‌లో బీఆర్ఎస్‌కు షాక్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎసకు షాక్ తగిలింది. నిజామాబాద్ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## బీఆర్ఎస్ మునిగిపోయే నావ

**మెడ మీద తలకాయ ఉన్న వారెవరూ**

**ఆ పార్టీతో పొత్తు పెట్టుకోరు: బండి సంజయ్**



సిరిసిల్ల, ఫిబ్రవరి 15 : బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, మెడకాయ మీద తలకాయ ఉన్న వారెవరూ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోరని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం వద్ద బండి సంజయ్ తాను చేపట్టిన ప్రజాహిత తొలిదశ యాత్రను ముగించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుడి విగ్రహానికి పూల మాల వేసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీజేపీ 400 సీట్లు గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎసతో పొత్తు పెట్టుకోవాల్సిన కర్మ తమకు లేదని అన్నారు. మోదీ హవాను తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని దెబ్బ తీసేందుకు విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని బహిష్కరించిన కాంగ్రెసను దేశ ప్రజలు వెలివేయబోతున్నారని అన్నారు. కొందరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు బీజేపీలో చేరబోతున్నారని తెలుసుకున్న కేసీఆర్ పొత్తు పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు డ్రామాలాడుతూ ప్రజలను దారి మళ్లిస్తున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షల కోట్ల ప్రజా ధనాన్ని వృధా చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఆయన కుటుంబ ఆస్తులను జప్తు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# మేడారానికి కేంద్రం మొండిచేయి

**తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని వైనం..**

**జాతీయ హోదా ప్రకటనపై దాటవేత ధోరణి**

**ప్రత్యేక రైలు సర్వీసులనూ నడిపించని రైల్వే**

**కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి..**

**ఉన్నా.. మహా జాతరకు కానరాని చేయూత**



వరంగల్, ఫిబ్రవరి 15 : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ.. తెలంగాణ కుంభమేళా.. ఐదారు రాష్ట్రాల నుంచి కోటిన్నర మందికి పైగా భక్తులు తరలివచ్చే మేడారం మహా జాతరపై కేంద్రం శీతకన్ను వేస్తోంది. గత రెండు జాతరలకు కాస్తో కూస్తో నిధులిచ్చిన సర్కారు.. ఈసారి అది కూడా ఇవ్వలేదు. మరోవైపు మేడారం మహా జాతరకు జాతీయ హోదాపై 2018 నుంచి కేంద్రం దాటవేస్తూనే ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి ఈ వేడుకకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడిపించే రైల్వే శాఖ ఈసారి ఆ ఊసే ఎత్తలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం మేడారం మహా జాతరపై చిన్నచూపు చూస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### జాతీయ హోదాపై మౌనం..

ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం మహా జాతరకు తెలంగాణ, ఏపీ, ఛత్తీసగఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి జాతరకు రూ.110 కోట్లు కేటాయించింది. 2020 నాటి జాతర కోసం కేంద్ర ప్రభుత్వం రూ.6.10 కోట్లు, 2022లో రూ.2.50 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా మన రాష్ట్రానికి చెందిన బీజేపీ ముఖ్య నేత కిషన్‌రెడ్డి ఉన్నారు. అయినా మేడారం జాతరకు ఈ ఏడాది ఒక్కపైసా కూడా ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 1996లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మేడారం మహా జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇచ్చింది. దీంతో భక్తుల సంఖ్య భారీగా పెరగటంతో జాతరకు జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ 2002 నుంచి ఊపందుకుంది. 2018లో మేడారానికి జాతీయ హోదా ఇచ్చేందుకు అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్లను గిరిజన సంక్షేమ శాఖ కేంద్రానికి సమర్పించింది. కానీ, ఆ ఏడాది రావాల్సిన జాతీయ హోదా ప్రకటనపై కేంద్రం వెనక్కి తగ్గింది. అప్పటి నుంచి మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర సర్కారు డిమాండ్ చేస్తున్నా కేంద్రం మౌనం వహిస్తోంది. తమ పార్టీ అధికారంలోకి వస్తే మేడారం జాతరకు జాతీయ హోదా తెస్తామని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి పర్యాటక మంత్రిగా ఉన్నందున.. మేడారం జాతరకు జాతీయ హోదా తెచ్చేందుకు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు. ‘

### జాతర రైళ్లు ఉన్నట్టా.. లేనట్టా..?

మేడారం జాతరకు తెలంగాణ, ఏపీ, ఛత్తీసగఢ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వస్తారు. వీరు మేడారం చేరుకునేందుకు కేంద్రం సరైన ఏర్పాట్లు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రైళ్ల పొడిగింపుతో పాటు జాతరకు ప్రత్యేక రైళ్లను నడిపించాల్సి ఉంది. 2014 నుంచి 2022 వరకు ఐదు జాతరలకు రైల్వే శాఖ 16 ప్రత్యేక రైళ్లను నడిపింది. కాగజ్‌నగర్-కాజీపేట, వరంగల్-సికిందరాబాద్, ఖమ్మం-వరంగల్-కాగజ్‌నగర్ మధ్య ప్యాసింజర్ రైళ్లను అందుబాటులో ఉంచింది. అయితే ఈసారి రైల్వేశాఖ మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్టుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక తెలంగాణ జిల్లాలతో పాటు ఏపీ, ఛత్తీసగఢ్, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతామని గతంలో కేంద్రం ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. ఇప్పటికైనా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు చొరవ తీసుకుని ప్రత్యేక రైళ్లను నడిపించేలా కేంద్రాన్ని ఒప్పించాలని భక్తులు కోరుతున్నారు.